క్లుప్తంగా

ఐకమత్యంతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పౌరహక్కులు తెలుసుకోవడంతో ప్రజా సమస్యలు దూరం అవడంతో పాటు, ప్రజల ఐక్యతతో గ్రామ అభివృద్ధి సాధ్యమని ఆర్‌ఐ వెంకటేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో పౌరహక్కుల సదస్సు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్ మహబూబ్, ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేట గ్రామంలో ఆంజనేయ, శివపంచాయతన(శివలింగం, అమ్మవారు, గణపతి, విష్ణుమూర్తి, సూర్యుడు), నాగదేవత, విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని గ్రామ హనుమాన్ భక్తమండలి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం స్వస్తివచనం, గోపుపూజ, గణపతి పూజ, ఆఖండదీపాస్థాపన, అగ్నిప్రతిష్ఠ, హారతి తదితర వాటిని నిర్వహించారు. ఈ సందర్భంగా భజనమండలి సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో హనుమాన్ ఆలయం శిథిలావస్థలో ఉండడంతో మాధవానందసరస్వతి సూచనల ప్రకారం ఆలయాన్ని పునఃనిర్మించి, విగ్రహాల ప్రతిష్ఠాపన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాంతప్ప, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

మనోహరాబాద్(తూప్రాన్): రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. శనివారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమల వాడలో పరిశ్రమల ప్రతినిధులతో జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, ఐలా సంఘం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కల పట్టివేత


మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వర రావు

రేగోడ్(మెదక్): అంతర పంటలో సాగు చేసిన గంజాయి మొక్కలపై మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వర రావు దాడులు జరిపి పట్టుకున్న సంఘటన మండలంలోని ప్యారారం గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ప్యారారం సమీపంలో రామినిబాయి సొంత పొలంలో ఆమె జొన్న పంట సాగు చేశారు. జొన్న పంటలో 12 గంజాయి మొక్కలు సాగు చేశారు. నమ్మదగిన సమాచారం మెరకు పంటపై దాడి చేయగా.. గంజాయి మొక్కలు లభించాయని, వీటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. 12 గంజాయి మొక్కలు విలువ రూ.1 లక్షా 20 వేలు ఉంటుందని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ మాన్‌సింగ్, హెడ్ కానిస్టేబుల్ సిద్ధయ్య, సర్దార్ ఆలీ తదితరులు పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత మద్యం, కల్లు దుకాణాలపై 90 కేసులు నమోదు చేసి, 51 మందిని అరెస్ట్ చేసినట్లు మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వర రావు తెలిపారు. 43వేల ఏడు వందల లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, వీటి విలు రూ.35 లక్షల 50వేలు ఉంటుందని చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా బండ్ల ఊరేగింపు


గుమ్మటాల బండ్ల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మకు భక్తులు బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. శనివారం నల్లపోచమ్మ జాతరలో భాగంగా అమ్మవారికి గ్రామ వతన్‌దారులతోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బండ్లను ఊరేగించారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు శివప్ప, రాజేశ్ అమ్మవారిని పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. దేవాదాయశాఖ అధికారులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు , నాయకులు మానిక్యారెడ్డి ఉన్నారు.

సాగునీరు వదిలేదిలేదు

- అధికారుల వైఖరిపై చెన్నాయిపల్లి రైతుల ఆగ్రహం
- సామరస్యంగా సమస్యను పరిష్కారిస్తాం: ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు


చెన్నాయిపల్లి రైతుల పంటలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): చెన్నాయిపల్లి గ్రామ రైతుల పంటలకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్, రెవన్యూ, పోలీస్ అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మండల పరిధిలోని శాలిపేట గ్రామంలోని నల్లచెరువు నీళ్లు వదలకపోవడంతో చేతికొచ్చిన పంట ఎండు ముఖం పట్టిందని చెన్నాయిపల్లి రైతుల ఆవేదనపై శనివారం 'సాక్షి' పత్రికలో చెరువులో నీళ్లు ఉన్నా.. వదలడంలేదు అనే కథనంతో అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ మన్నన్, ఎస్‌ఐ నారాయణగౌడ్ చెన్నాయిపల్లి గ్రామ రైతుల పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చివరి దశకు వచ్చిన పంటలకు అవసరమైన సాగునీరు వదిలేందుకు చర్యలు చేపట్టనున్నట్లు రైతులకు చెప్పారు. పంటలను కాపాడేందుకు చెరువులోని నీరు అందించనున్నట్లు తెలిపారు. ఇదే విషయంపై శాలిపేట గ్రామస్తులతో మాట్లాడారు. చెరువు నుంచి సాగునీరు వదిలేందుకు ఉన్న అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. సాగునీరు వదిలి పంటలను కాపాడాలని శాలిపేట గ్రామ రైతులకు నచ్చచెప్పారు. శాలిపేట నల్లచెరువు వద్దకు అధికారులు నీరు వదిలేందుకు వచ్చారనే విషయం తెలుసుకున్న శాలిపేట గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. సాగునీరు వదిలితే చెరువు కింద తాము సాగుచేసిన పంటలు కోతకు అవకాశం లేకుండా పోతాయని, చెరువు నుంచి నీరు వదలమని అధికారులతో వాగ్వాదానికి దిగారు. చెరువు నీరు వదిలితే తమ పంటలకు జరిగే నష్టంకు అధికారులు బాధ్యత వహిస్తారా అంటు ప్రశ్నించారు. అధికారులు రైతులకు అన్ని రకాలుగా నచ్చచెప్పినప్పటికీ వారు నీరు వదిలేందుకు ఒప్పుకోకపోవడంతో వెనుదిరుగా, చెన్నాయిపల్లి వద్ద రైతులు అధికారుల వాహనాలకు అడ్డుగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పంటలకు రావాల్సిన నీరు వదలడంలో అధికారులు ఉదాసినతగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఒక రోజు సమయం ఇవ్వాలని సాగునీరు వదిలేందుకు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు రైతులకు హామీ ఇచ్చారు.


శాలిపేట రైతులతో మాట్లాడుతున్న అధికారులు

గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపులో భక్తులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్‌లో గ్రామదేవతలు దుర్గమ్మ, పోచమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో బాగంగా శనివారం అమ్మవార్లకు అబిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు బోనాలను ఊరేగించి అమ్మవార్లకు సమర్పించారు.

సమన్వయంతో పనిచేయాలి

బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలందరు విజయమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చండీలోని జెఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శివ్వంపేట, వెల్దుర్తి మండలాల భూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడోసారి ముచ్చటగా నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావడం ఖాయం అయిపోయిందన్నారు. బీఆర్‌ఎస్ మునిగిపోయిన టైటానిక్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు తీసుకొచ్చి ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే దుస్థితిలో ఉందన్నారు. మోదీ దేశం కోసం చేసిన అభివృద్ధి పనుల వల్ల 47 శాతం ఓటర్లు బీజేపీ వైపు ఉన్నారన్నారు. ప్రతీ కార్యకర్త ఓటరు వద్దకు వెళ్లి కమలం పువ్వు గుర్తుకు ఓటేయ్యాలని చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొండల్‌రావ్ బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు మురళిధర్‌యాదవ్, మల్లేశ్‌గౌడ్, రాజేందర్, సురేష్, బుచ్చేష్‌యాదవ్, రమణరావ్, శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు పెద్దపులి రవి, తదితరులు ఉన్నారు.

తునికి నల్లపోచమ్మకు పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ జాతర సందర్భంగా మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అమ్మవారిని దర్శించుకున్నారు.

పార్టీని ముందుకు తీసుకెళ్లేది బూత్ అధ్యక్షులే

కొల్చారం(నర్సాపూర్): గ్రామస్థాయిలో పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో బూత్ అధ్యక్షులదే ప్రధాన పాత్ర అని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పేర్కొన్నారు. మండలంలోని పోతంశెట్టిపల్లిలో పార్టీ బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశాన్ని మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ.. బీజేపీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, నియోజకవర్గ నాయకులు వాల్దాస్ మల్లేశంగౌడ్, మండల నాయకులు పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ అధికారం బీజేపీదే

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్


రేగోడ్‌లో ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరిన యువకులు

రేగోడ్(మెదక్): కేంద్రంలో మళ్లీ అధికారం బీజేపీదే అని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రం రేగోడ్‌లో సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. బుల్లెట్ నడిపి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. గాంధీ విగ్రహం సమీపంలో వ్యాపారులను ఆప్యాయంగా పలకరించి తనకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎనిమిది గ్రామాల్లోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. తనను మళ్లీ గెలిపిస్తే బీజేపీ ప్రభుత్వం ద్వారా మరింత అభివృద్ధి చేసుకుందామని భరోసానిచ్చారు. ఎంపీ బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, నాయకులు హన్మంతు, అరవింద్‌రెడ్డి, అందోల్ నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

0మరోసారి అధికారంలోకి బీజేపీ

పెద్దశంకరంపేట(మెదక్): మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేట పార్టీ కార్యాలయంలో చీలాపల్లి, ముసాపేట, జంబికుంట తదితర గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ యువకులు బీబీ పాటిల్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, మారుతిరెడ్డి, మండలాధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు సూర్యప్రకాష్, అశోక్, శ్రీహరి, శ్రావణ్, సుభాష్, భాను, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

కరువుభత్యం పెంచాలి


జిల్లా లేబర్ కమిషనర్ యాదయ్యకు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

మెదక్ కలెక్టరేట్: కార్మికుల కనీస వేతన చట్టంలో కరువు భత్యం పెంచాలని ఖాజాపూర్‌లోని కావేరి ఐరన్ అండ్ స్టీల్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.మల్లేశం, పెద్ద రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాల కరువుభత్యం సవరిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గవర్నమెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌లో అనేక అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై శనివారం జిల్లా లేబర్ కమీషనర్ యాదయ్యను కలిసి వినతి పత్రం అందజేసినట్లు వివరించారు. యూనియన్ కోశాధికారి బాలయ్య పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ సీజ్

తూప్రాన్: అక్రమంగా మట్టి తరలిస్తున్న మట్టి టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అల్లాపూర్ శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న సమాచారం మేరకు టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

వైభవంగా వరసిద్ధి వినాయక వార్షికోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో వెలసిన వరసిద్ధి వినాయక వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం గణపతి హోమం, నవగ్రహ పూజ, స్థాపిత దేవత పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు లక్ష్మారెడ్డి, నరేందర్, నర్సింలు, రవీందర్, శంకర్, సత్యనారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో భాగంగా తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం తాజా మాజీ సర్పంచ్ బాబుపై దాడి చేసిన ప్రైవేట్ వెంచర్ యాజామాన్యంపై అట్రాసిటీ కేసును సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేశారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు


అల్లాదుర్గం పరీక్షా కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


కౌడిపల్లి(నర్సాపూర్): ముత్రాజ్‌పల్లిలో విజయ సంకేతం చూపిస్తున్న విద్యార్థులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శనివారంతో పది పరీక్షలు ముగిశాయి. ఈ సందర్భంగా డిపార్ట్ మెంట్ ఆఫీసర్ అబ్దుల్ రసీద్ మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి మొదలైన పది పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఇప్పటి వరకు పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ప్రతి రోజు 100 శాతం మంది విద్యార్థులు హాజరన్నట్లు తెలిపారు.

అల్లాదుర్గం(మెదక్): మండలంలో పదవ తరగతి పరీక్షలు శనివారంతో సోషల్ పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులు పరీక్షలు రాసి సంతోషంగా పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చారు.

కౌడిపల్లి(నర్సాపూర్): పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మూడు గురుకుల పాఠశాలలకు చెందిన 537 మంది విద్యార్థులు విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు.

వాహనాల తనిఖీ


బోనాల్ చెక్‌పోస్టు వద్ద ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని కోళాపల్లి 161వ జాతీయ రహదారిపై జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీ.బీ.పాటిల్ వాహనాన్ని శనివారం పోలీసులు తనిఖీ చేశారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని బోనాల్ గ్రామంలోని పోలీస్ చెక్ పోస్టు వద్ద ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేశారు.

రామాయంపేట(మెదక్): కామారెడ్డి, మెదక్ జిల్లాల సరిహద్దులో రామాయంపేట శివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆయనవెంట ఎస్‌ఐ రంజిత్, పోలీసులు ఉన్నారు.

నర్సాపూర్: నర్సాపూర్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టు శనివారం మెదక్ ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి కారును అధికారులు తనిఖీ చేశారు.

అభివృద్ధి విషయంలో ప్రశ్నించేతత్వం పెరగాలి

పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ అనంతరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం దినదినాభివృద్ధి చెందుతుందని, సభ్యులు ప్రశ్నించేతత్వం అలవర్చుకుంటే సొసైటీని మరింత అభివృద్ధి చేయవచ్చని సొసైటీ చైర్మన్ తిరుమల అనంతరెడ్డి అన్నారు. ఈ మేరకు చైర్మన్ అధ్యక్షతన శనివారం సొసైటీలో వార్షిక మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాదికి సంబంధించిన ఆడిట్ ఆమోదించడంతో పాటు 2023–24కు సంబంధించిన బడ్జెట్ వివరాలపై డైరెక్టర్‌లు చర్చించారు. గత సంవత్సరం సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ రకాల వ్యాపారం, సేవలకు గాను సొసైటీకి మంచి ఆదాయం వచ్చినట్లు చైర్మన్ అనంతరెడ్డి పేర్కొన్నారు. డైరెక్టర్‌లు, సిబ్బంది, రైతుల సహకారం వల్లే సొసైటీ అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈఓ సిద్ధయ్య, వైస్ చైర్మన్ మురళి, డైరెక్టర్లు నర్సింలు, పోతిరెడ్డి, సత్యనారాయణ, అమృత, మాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3 లక్షలు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తుల సమక్షంలో 3 నెలల పదకొండు రోజులకు సంబంధించి హుండీ లెక్కించగా.. రూ.3 లక్షల 27 వేల 358 వచ్చాయి. ఈ కార్యక్రమంలో పరిశీలకులు రంగారావు, ఈఓ సార శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ, గ్రామస్తులు నారాయణరావు, హరిసింగ్‌నాయక్, శంకర్‌గౌడ్, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలతో సమస్యలెన్నో..

సఖి కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ రేణుక


అవగాహన కల్పిస్తున్న సఖి కేంద్రం జిల్లా కో - ఆర్డినేటర్ రేణుక

అల్లాదుర్గం(మెదక్): బాల్య వివాహాలతో ఎన్నో సమస్యలతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని సఖి కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ రేణుక, కెస్ వర్కర్ కళావతి అన్నారు. శనివారం మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామంలో సఖికేంద్రం, మై చాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహహింస, వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా, యాసిడ్ దాడులు, అత్యాచారాలు, ప్రేమా ప్రలోభాల వలన మిస్సింగ్, కిడ్నాప్, పోక్సో కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. వీటితో అమ్మాయిలను, మహిళలను అక్రమ రవాణా చేసి వ్యభిచార గృహాల్లోకి విక్రయిస్తున్నారని, అబ్బాయిలను కర్మాగారాలు, బాల కార్మికులుగా మారుస్తున్నారన్నారు. మహిళలకు, బాలికలకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు 181,112,1098, 18004198588, 1930 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తూప్రాన్ మున్సిపల్ బీజేపీ కార్యవర్గం ఎన్నిక

తూప్రాన్: మున్సిపల్ బీజేపీ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షుడుగా భూమన్నగారి జానకిరామ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శేరి సిద్ధిరాములు, గడ్డం రవీందర్, మధుసూదన్, సీహెచ్.కార్తీకగౌడ్, జనరల్ సెక్రెటరీగా డి.సాయిపృథ్వీ, బి.సంపత్ గౌడ్, పి.శరత్, కార్యదర్శులుగా నాగరాజు, పి.ఆంజనేయులు, ఎస్.రాకేష్, వీరభద్ర, ఎం.శ్రీశైలం, అధికార ప్రతినిధిగా ప్రశాంత్, పి.మహేశ్, కోశాధికారిగా ఎస్.శంకర్, బీజేవైఎం మోర్చా అధ్యక్షుడిగా ఎం.సంతోష్, మహిళా మోర్చాగా ఎం.సీతామహాలక్ష్మి, కిసాన్ మోర్చాగా సిహెచ్.మల్లేశ్, ఎస్సీ మోర్చాగా బునేష్, ఎస్టీ మోర్చాగా రాజు, సోషల్ మీడియా ఐటి సెల్ కన్వీనర్‌గా ఎస్.వినయ్, కోకన్వీనర్‌గా జీ.నితిన్ ఏకగ్రీవంగా నియమించారు.

◆ రంగోత్సవ్ పోటీలో విద్యార్థుల ప్రతిభ



మనోహరాబాద్(తూప్రాన్): ముంబాయిలో జరిగిన రంగోత్సవ్ చిత్రలేఖన పోటీల్లో కాళ్లకల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాణించినట్లు హెచ్‌ఎం వెంకటస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జనవరిలో ఆన్‌లైన్‌లో జరిగిన చిత్రలేఖన పోటీల్లో కాళ్లకల్‌కు చెందిన 20 మంది విద్యార్థులు రాణించి, పతకాలతో పాటు, ప్రశంస పత్రాలను అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ దేశ అభివృద్ధికి పాటుపడాలి

అల్లాదుర్గం(మెదక్): బీజేపీకి ఓటు వేసి దేశ అభివృద్ధికి పాటుపడాలని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎంపీ బీబీపాటిల్ అన్నారు. శనివారం అల్లాదుర్గంలో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. నాయకులు రాములు, సాయిలుగౌడ్, ప్రభాకర్ గౌడ్, కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

◆ కేసీఆర్ కాలనీలో నీటి సమస్యను తీర్చండి



రామాయంపేట(మెదక్): పట్టణంలోని కేసీఆర్ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తిచేశారు. ఈమేరకు వారు శనివారం రామాయంపేటలో మైనంపల్లి హన్మంతరావుకు వినతిపత్రం అందజేశారు.

◆ పౌర హక్కులపై అవగాహన

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో పౌర హక్కులపై అవగాహన కల్పించినట్లు ఏఎస్‌ఐ మూర్తి, ఆర్‌ఐ దీక్షిత్ తెలిపారు. కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

◆ సీసీరోడ్డు పనుల పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో సీసీరోడ్డు పనులను శనివారం పీఆర్ ఏఈ ప్రభాకర్ పరిశీలించారు.

◆ మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగిరేస్తాం

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ ఎంపీగా గెలిచి కాంగ్రెస్ జెండాను ఎగిరేస్తామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు తెలిపారు. శనివారం మండలంలోని తునికి నల్లపోచమ్మ జాతర సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాస్ గుప్తా, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ దివ్యాంగులకు ఉచిత బస్సుపాస్‌లు



మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో మండలంలోని దివ్యాంగులకు ఉచితంగా బస్సు పాసులను అందజేసినట్లు ఆర్టీసీ అధికారి టీవీ ధనుంజయ శనివారం తెలిపారు. బస్సుపాసులకు అవసరమైన ఖర్చును ఎంపీటీసీ లత భరించారు.